
సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
సోమవారం । 9 । జూన్ । 2025



అబ్బురపరుస్తున్న అందాలు

పెనుకొండలోని పురాతన కట్టడాలు అబ్బుర పరుస్తున్నాయి. పలు కట్టడాలు విజయనగర రాజుల వైభవాన్ని కళ్లకు కట్టినట్టు చూపుతున్నాయి. 8లో



అప్పులు తీర్చలేక ఆత్మహత్య

కుటుంబ అవసరాల కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం కనిపించక, రుణదాతలకు ముఖం చూపలేక బత్తలపల్లికి చెందిన ఓ కూలీ ఆత్మహత్య చేసుకున్నాడు. 8లో

గరిష్టం/కనిష్టం
36.6°/21.4°

జిల్లా పరిధిలో ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత స్వల్పంగా పెరిగింది. గాలివేగం తగ్గింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

ఖాద్రీ ఆలయానికి పోటెత్తిన భక్తులు



వేలాదిగా తరలివచ్చిన భక్తులు

కదిరి టౌన్: శ్రీదేవి భూదేవి వసంతవల్లభుడు ఖాద్రీశుని జన్మ నక్షత్రం స్వాతి నక్షత్రం కావడంతో ఆదివారం ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఓం నమో నారసింహా.. అంటూ గోవింద నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. కదిరి పరిసరాల ప్రాంతాల నుంచే కాకుండా కర్ణాటక, కడప, చిత్తూరు, అనంతపురం జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. స్వామి కావులు తలనీలాలు సమర్పించుకున్నారు. మహిళలు దీపాలు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నేడు ఏడు గుర్రాలపల్లికి మహిళా కమిషన్ సభ్యురాలి రాక

ప్రశాంతి నిలయం: రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు డాక్టర్ షేక్ రోఖియా బేగం సోమవారం రామగిరి మండలం ఏడుగుర్రాలపల్లిలో పర్యటించనున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను కలెక్టర్ చేతన్ మీడియాకు వెల్లడించారు. మహిళా కమిషన్ సభ్యురాలు ఉదయం 8 గంటలకు బెంగళూరు నుంచి రోడ్డు మార్గాన బయల్దేరి ఏడుగుర్రాలపల్లికి చేరుకుంటారు. అక్కడ లైంగిక దాడికి గురైన దళిత బాలికను, ఆమె కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించి, వివరాలు తెలుసుకుంటారు. 11.15 గంటలకు బాధితురాలి ఇంటి నుంచి రామగిరి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి అధికారులతో ఘటనపై ఆరా తీస్తారు. మధ్యాహ్నం 1.30 గంటలకు రోడ్డు మార్గం ద్వారా పుట్టపర్తికి చేరుకుంటారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీని కలిసి లైంగికదాడి ఘటనకు గల కారణాలను తెలుసుకుంటారు. మధ్యాహ్నం 3 గంటలకు ఐడీడీఎస్ పీడీతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించిన అనంతరం బెంగళూరుకు బయల్దేరి వెళ్తారు.

సత్యసాయి మార్గంలో నడవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న సత్యసాయి మహిళా విభాగం సభ్యులు

ప్రశాంతి నిలయం: సత్యసాయి మార్గంలో నడిచి కుటుంబంతో పాటు చక్కటి సమాజాన్ని నిర్మించేందుకు కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. సమాజంలో ఆధ్యాత్మిక, మానవతా విలువలు పెంపొందిస్తూ సమ సమాజ స్థాపనకు కృషి చేసే అంశంపై చర్చించేందుకు ప్రశాంతి నిలయంలో ప్రారంభమైన మూడు రోజుల అంతర్జాతీయ మహిళా సదస్సు ఆదివారం ముగిసింది. ఉదయం సత్యసాయి మహిళా విభాగం సభ్యులు యజుర్ మందిరం నుంచి సత్యసాయి మహా సమాధి వరకు ర్యాలీ నిర్వహించారు. సత్యసాయి సేవా సంస్థల పతాకాన్ని, సత్యసాయి విలువను చూపే ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా పలువురు మహిళామణులు తమ సందేశాన్ని వినిపించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు బాలల దుర్మరణం

- మరొకరికి తీవ్రగాయాలు

గాండ్లపెంట: ఎన్‌పీకుంట మండలం ఎదురుదొన పంచాయతీ ముఖములవారిపల్లి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు బాలలు దుర్మరణం చెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తనకల్లు మండలం మారెప్పగారిపల్లికి చెందిన స్నేహితులు మహమ్మద్ సుహైల్ (16), లతీఫ్ (15), తోసిఫ్ గాండ్లపెంట మండలంలోని తిమ్మమ్మ మర్రిమానును సందర్శించడానికి ఆదివారం మధ్యాహ్నం ద్విచక్రవాహనంపై బయల్దేరారు. ముఖములవారిపల్లి సమీపంలోకి రాగానే ఎదురుగా వచ్చిన క్వాలిస్ వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంలో ప్రయాణిస్తున్న మహమ్మద్ సుహైల్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన లతీఫ్, తోసిఫ్‌లను స్థానికులు కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కొద్దిసేపటి తర్వాత లతీఫ్ మృతి చెందాడు. విషయం తెలిసిన వెంటనే బాధిత తల్లిదండ్రులు ఆస్పత్రికి చేరుకున్నారు. కుమారుల మృతదేహాలను చూసి గుండెలవిసేలా రోదించారు.

సంప్రదాయ పంట వేరుశనగ సాగుకు సిద్ధమైన రైతులకు ప్రభుత్వం నుంచి తగినంత సబ్సిడీ విత్తనకాయలు అందేలా కనిపించడం లేదు. విత్తన పంపిణీ రిజిస్ట్రేషన్ ప్రక్రియే సక్రమంగా సాగడం లేదు. అవసరం మేరకు విత్తనకాయలు వచ్చే అవకాశం లేకుండా పోతోంది. దీంతో రైతులు ప్రైవేట్‌గా అదనపు ధరకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి.

జిల్లాలో 1.51 లక్షల హెక్టార్లలో వేరుశనగ సాగుకు సన్నాహాలు

- ఎకరాకు 120 కేజీల చొప్పున 63,918 క్వింటాళ్ల విత్తనం అవసరం
- జిల్లాకు వచ్చింది కేవలం 26,784 క్వింటాళ్ల విత్తనమే
- నేటికీ ప్రారంభంకాని విత్తన పంపిణీ.. ఆందోళనలో అన్నదాతలు



రాయితీ విత్తుకు కత్తెర

హిందూపురం: ఖరీఫ్‌లో వేరుశనగ సాగుకు సిద్ధమైన రైతులకు రాయితీ విత్తనం అందడం అనుమానంగా మారింది. 40 శాతం రాయితీతో విత్తనం అందిస్తున్నామంటూ కూటమి సర్కార్ హడావుడి చేస్తున్నా... నేటికీ విత్తన పంపిణీ ప్రారంభించలేదు. పైగా అరకొరగా జిల్లాకు సరఫరా చేయడంతో విత్తనం అందే పరిస్థితి లేక సాగుకు ముందే రైతు చిత్తయిపోతున్నాడు.

జిల్లాకు చేరింది 26 వేల క్వింటాళ్లే

ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 2,69,152 హెక్టార్లు కాగా, ఇందులో ప్రధాన పంట వేరుశనగ 1,51,824 హెక్టార్లలో సాగులోకి వస్తుందని అంచనా వేస్తున్నారు. ఇందుకోసం 63,918 క్వింటాళ్ల విత్తన వేరుశనగ అవసరంకాగా, జిల్లాకు నేటి వరకూ 26,784 క్వింటాళ్లు విత్తనం మాత్రమే అధికారులు పంపారు. పైగా నేటికీ విత్తన పంపిణీ ప్రారంభించలేదు. ఇక ధర విషయానికొస్తే కేజీ వేరుశనగ విత్తనం పూర్తి ధర రూ.93 కాగా, ప్రభుత్వం ప్రకటించిన 40 శాతం సబ్సిడీ రూ.37.20 పోను రైతు కేజీకి రూ.55.80 మేర చెల్లించాల్సి ఉంటుంది. మొత్తంగా 30 కేజీల బస్తాకు రైతు తన వాటాగా రూ.1,694 చెల్లించాల్సి ఉంటుంది.

రిజిస్ట్రేషన్ ఆలస్యం

విత్తన వేరుశనగ పంపిణీ కోసం రైతులు ముందుగా రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. జిల్లాలో 442 రైతు సేవా కేంద్రాలుండగా.. చాలా కేంద్రాల్లో అగ్రికల్చర్ అసిస్టెంట్లు లేరు. దీంతో ఒక్కో అగ్రికల్చర్ అసిస్టెంట్‌కు రెండు రైతు సేవా కేంద్రాల బాధ్యతలు అప్పగించారు. ఆయా కేంద్రాల పరిధిలోని రైతులందరి రిజిస్ట్రేషన్ చేయాల్సిన బాధ్యత వారిదే. దీంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియనే ఆలస్యంగా సాగుతోంది.



పొలం సిద్ధం చేసుకుంటున్న రైతు



పంపిణీకి సిద్ధం చేసిన విత్తన వేరుశనగ బస్తాలు

అరకొరలోనూ పచ్చనేతలకే ప్రాధాన్యం

ఇప్పటికే జిల్లాకు చేరిన విత్తనకాయల్లోనూ పచ్చనేతలకే తొలి ప్రాధాన్యం ఇచ్చేలా అధికారులకు అనధికార ఆదేశాలు అందాయి. ఈనేపథ్యంలో ఈసారి ఖరీఫ్ వేరుశనగ సాగు ప్రశ్నార్థకంగా మారింది. దీంతో చాలా మంది రైతులు ఇప్పటికే ఇతర జిల్లాలు, మండలాల్లోని రైతుల నుంచి విత్తనం తెచ్చుకోవడానికి సిద్ధమవుతున్నారు. ఆమాత్రం స్తోమత లేని వారు ఈసారి భూములను బీళ్లుగా వదిలేసేందుకు సిద్ధమయ్యారు.

ఎంత భూమి ఉన్నా 3 బస్తాలే

విత్తన వేరుశనగ పంపిణీలో ప్రభుత్వం ఆంక్షలు విధించింది. ఎకరం భూమి ఉన్న రైతుకు ఒక బస్తా (30కేజీలు).. రెండు ఎకరాలు ఉంటే 2 బస్తాలు, మూడు ఎకరాలకు 3 బస్తాల విత్తనమే ఇవ్వాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలోనే 3 ఎకరాలకు మించి ఎన్ని ఎకరాలున్నా గరిష్టంగా 3 బస్తాలు మాత్రమే ఇస్తామని అధికారులు చెబుతున్నారు. నీటి సౌకర్యం ఉన్న తోటల్లో ఎకరం వేరుశనగ సాగుకు 30 కేజీల బస్తాలు 4 సంచులు అవసరం అవుతాయి. అంటే 120 కేజీలు. ప్రభుత్వం గరిష్టంగా 3 బస్తాలు ఇస్తే ఎకరం కూడా పంటను సాగు చేయలేమని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ ప్రైవేట్‌గా ఎక్కువ డబ్బు పెట్టి విత్తనం సమకూర్చుకోవాల్సి వస్తోందంటున్నారు.

డెడ్ స్టోరేజీకి 'పీఏబీఆర్' నీటి మట్టం



పీఏబీఆర్‌లో నిల్వ ఉన్న నీరు

కూడేరు: మండలంలోని పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్)లో నీటి మట్టం గణనీయంగా తగ్గుతోంది. రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో లేదు. ఉమ్మడి జిల్లాలోని తాగునీటి పథకాలకు, నీటి ఆవిరి, లీకేజీల కారణంగా రోజుకు 80 క్యూసెక్కుల వరకు నీరు బయటకెళుతోంది. దీంతో రోజురోజుకూ నీటి మట్టం తగ్గుతోంది. రిజర్వాయర్ వాస్తవ నీటిమట్టం 11.1 టీఎంసీలు కాగా.. ఆదివారం నాటికి 2.3 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉందని నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే రానున్న రోజుల్లో తాగునీటి కష్టాలు తప్పవని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కామాంధులను కఠినంగా శిక్షించాలి

- దళిత బాలికకు న్యాయం జరిగేవరకు పోరాడుతాం
- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపోగు సురేష్ మాదిగ



పేరూరులో మాట్లాడుతున్న నాయకులు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: ఏడుగుర్రాలపల్లిలో దళిత బాలికను బెదిరించి అఘాయిత్యానికి పాల్పడిన కామాంధులను కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపోగు సురేష్ మాదిగ డిమాండ్ చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లా ఎమ్మార్పీఎస్, దళిత సంఘం నాయకులతో కలిసి ఆయన ఆదివారం రామగిరి మండలం పేరూరు నుంచి ఏడుగుర్రాలపల్లి వరకు మూడు కిలోమీటర్ల మేర పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా రుద్రపోగు సురేష్ మాట్లాడుతూ దళిత బాలికపై 14 మంది మృగాళ్లు ఆరు నెలలుగా అత్యాచారం చేయడం దారుణమన్నారు. ఆ గ్రామంలో దళితులు, గ్రామస్తులను కలిసి పలు విషయాలు తెలుసుకున్నామని, గతంలో ఆ గ్రామంలో పెద్దమ్మతల్లి దేవస్థానం నిర్మాణానికి కూడా కొందరు నాయకులు అడ్డుపడ్డారని, పలువురు దళిత యువకులను గ్రామబహిష్కరణ చేశారని, ఇది చాలా దారుణమని పేర్కొన్నారు. రాష్ట్రంలో హోంమంత్రిగా అనిత, జిల్లాలో మంత్రిగా సవితమ్మ, రాప్తాడు ఎమ్మెల్యేగా పరిటాల సునీత, జిల్లా ఎస్పీగా రత్న ఉన్నప్పటికీ ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనలపై ప్రభుత్వం సరిగా స్పందించకపోతే ఉద్యమం మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. బాధిత దళిత బాలిక కుటుంబానికి పక్కాగృహం, ఐదెకరాల భూమి, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు దబ్బల శ్రీరాములు, గంగాధర్, ప్రసాద్, రాచర్ల రామక్రిష్ణ, దబ్బల నరసింహులు, ముత్యాలప్ప, శేషప్ప, హరి, సి.ఎం.నరసిహులుతోపాటు రామగిరి, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి, ధర్మవరం తదితరప్రాంతాల దళిత సంఘం నాయకులు పాల్గొన్నారు.

ధర్మవరం నియోజకవర్గంలో కూటమి పార్టీల మధ్య చేరికల తతంగం రణరంగాన్ని తలపిస్తోంది. అవకాశ వాదులు, ఆశావహులను, ఇతర పార్టీలలో ఉన్న వారికి గాలం వేసి మా పార్టీలో చేరాలంటే మాపార్టీలో చేరాలని టీడీపీ, బీజేపీ, జనసేనలు పోటీ పడుతుండటంతో ఉద్రిక్తత వాతావరణం నెలకొంటోంది. గతంలో అనేక సంఘటనలు వీరి మధ్య అనైక్యతను బహిర్గతం చేశాయి. పైకి పొత్తు ధర్మం ప్రకారం అందరం నడుచుకోవాలని చెపుతూనే లోలోపల ఊసరవెల్లి రాజకీయాలు చేస్తుండటం చూసి ప్రజలు విస్మయానికి లోనవుతున్నారు.

- చేరికలను పోటాపోటీగా తీసుకుంటున్న నేతలు
- పొత్తు ధర్మం విస్మరిస్తుండటంతో కేడర్‌లో అసంతృప్తి
- టీడీపీ, బీజేపీ, జనసేన నేతల తీరుపై ప్రజల విస్మయం

కూటమిలో చేరికల యుద్ధం



కృష్ణాపురం జమీర్ బీజేపీలోకి చేరుతున్న సందర్భంలో ఇరువర్గాల ఘర్షణ (ఫైల్)



ధ్వంసమైన వాహనాలు (ఫైల్)

ధర్మవరం: కూటమి ప్రభుత్వం కొలువుదీరాక ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్, జనసేన ఇన్‌చార్జ్ చిలకం మధుసూదన్‌రెడ్డిలు నియోజకవర్గంలో పట్టు సాధించాలని గట్టి ప్రయత్నాలు చేశారు. ఆరంభంలో నియోజకవర్గానికి చెందిన ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలను, ఆశావహులకు గాలం వేసి, బెదిరించి తమ పార్టీలోకి చేర్చుకోవాలని మూడు పార్టీల వారు ప్రయత్నం చేశారు. అయితే ఒక పార్టీ వారు చేర్చుకునే ప్రయత్నం చేస్తుండగానే మరొక పార్టీ వారు అడ్డు పడటం పరిపాటిగా మారడంతో చేరికల కార్యక్రమం యుద్ధ వాతావరణాన్ని తలపించింది.

మచ్చుకు కొన్ని ఉదాహరణలు పరిశీలిస్తే..

- ఎన్నికలకు ముందు వైఎస్సార్‌సీపీలో ఉన్న కృష్ణాపురం జమీర్ అహ్మద్‌ను బీజేపీలోకి చేర్చుకోవాలని ఆ పార్టీ నాయకులు గట్టి ప్రయత్నాలు చేశారు. అయితే జమీర్‌ను బీజేపీలోకి చేర్చుకోవద్దంటూ టీడీపీ నుంచి బీజేపీ నాయకులకు ఒత్తిడి వచ్చింది. అయినప్పటికి బీజేపీ నాయకులు బేఖాతర్ చేస్తూ జమీర్‌అహ్మద్‌ను పార్టీలోకి చేర్చుకునేందుకు సిద్ధపడ్డారు. ఆ క్రమంలో జమీర్ ఇంటికి వెళ్లి టీడీపీ నాయకులు గొడవపెట్టుకున్నారు. దీంతో ఇరువర్గాలు ఘర్షణ పడ్డాయి.
- కుణుతూరు పంచాయతీ పరిధిలోని పోతుకుంటలో సర్పంచ్ అంగజాల నాగవేణి, ఆమె భర్త అంగజాల రాజును బీజేపీలోకి చేర్చుకోవాలని ప్రయత్నాలు ముమ్మరం చేయగా టీడీపీ నాయకులు అడ్డుపడ్డారు. ఏకంగా టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ వద్ద ఈ పంచాయితీ జరిగింది. దీంతో అంగజాల రాజు బీజేపీలోకి చేరికను కొంతకాలం వాయిదా వేసి.. తర్వాత మంత్రి సత్యకుమార్ సమక్షంలో చేర్చుకోవడంతో టీడీపీ శ్రేణులు అగ్గిమీద గుగ్గిలం అవుతున్నాయి. ఇదే పంచాయతీ పరిధిలోని పోతుకుంటకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆదినారాయణరెడ్డిని పార్టీలోకి చేర్చుకోవద్దని టీడీపీ నాయకులు అడ్డు పడినప్పటికీ జనసేన పార్టీలోకి చేర్చుకున్నారు. దీంతో ఆ పంచాయతీలోని టీడీపీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
- ధర్మవరంలో టీడీపీ, బీజేపీ నాయకులు వద్దని వారించినప్పటికీ వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు తొండమాల ఉమాదేవి, ఆమెభర్త తొండమాలరవి, సరితాల ఆశాబీ, ఆమె భర్త సరితాల బాషా, మల్లెల రమణమ్మ, ఆమె భర్త తోపుదుర్తి వెంకటరాముడిని ఏకంగా పవన్ కళ్యాణ్ సమక్షంలో జనసేన ఇన్‌చార్జ్ మధుసూదన్‌రెడ్డి పార్టీలోకి చేర్చుకున్నారు. ఈ నేపథ్యంలో కూటమి పార్టీల మధ్య విభేదాలు తలెత్తాయి. బీజేపీ, జనసేన పార్టీలు ఏమాత్రమూ ఖాతరు చేయకపోవడంతో టీడీపీ నాయకులు మండిపడుతున్నారు. ఇదే విషయాన్ని టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ దృష్టికి తీసుకెళ్లి తమ అసంతృప్తిని వెళ్లగక్కారు.

429 మందికి ఎస్‌ఏలుగా పదోన్నతి

- ఎస్జీటీలకు నేడు వెబ్ ఆప్షన్లు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 429 మంది ఎస్జీటీలకు ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపల్, మునిసిపల్ కార్పొరేషన్ యాజమాన్య పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ కేడర్ పదోన్నతులు లభించాయి. ఇందులో పీఎస్‌హెచ్‌ఎంలుగా 141 మంది (కన్నడ 1, తెలుగు 130, ఉర్దూ 10) ఉన్నారు. అలాగే ఎస్‌ఏ ఇంగ్లీష్ 46 మంది, హిందీ 01, తెలుగు 01, ఉర్దూ 01, బీఎస్ (తెలుగు) 38 మంది, బీఎస్ (ఉర్దూ) 04, గణితం (తెలుగు) 80 మంది, గణితం (ఉర్దూ) 05, పీడీ (తెలుగు) 06, పీఎస్ (కన్నడ) 01, పీఎస్ (తెలుగు) 46, పీఎస్ (ఉర్దూ) 01, సోషల్ (కన్నడ) 02, సోషల్ (తెలుగు) 50, సోషల్ (ఉర్దూ) ఆరుగురికి పదోన్నతి కల్పించారు. వీరితో పాటు ఇటీవల తప్పనిసరి, రిక్వెస్ట్ బదిలీలైన స్కూల్ అసిస్టెంట్లందరూ ఆదివారం వారి పాతపాఠశాలల్లో రిలీవ్ అయ్యారు. సోమవారం కొత్త స్కూళ్లలో రిపోర్ట్ చేసుకోనున్నారు.

ఎస్జీటీలకు నేడు వెబ్ ఆప్షన్లు

కాగా ఎస్జీ టీచర్ల బదిలీల్లో భాగంగా సోమవారం వెబ్ ఆప్షన్లు పెట్టుకోవాల్సి ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు. ఓవైపు మ్యాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని టీచర్లు, సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నా....ప్రభుత్వం మాత్రం వెబ్ కౌన్సెలింగ్‌కే మొగ్గు చూపింది. ఈ క్రమంలో అన్ని జిల్లాల విద్యాశాఖ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి. ఆసక్తి ఉన్న వారు వ్యక్తిగతంతో వెబ్ ఆప్షన్లు పెట్టుకోవచ్చు. ఇబ్బంది అని భావించేవారి కోసం ప్రతి మండలంలోనూ ఎమ్మార్సీల్లో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల్లోకి వెళ్తే... సిబ్బంది వెబ్ ఆప్షన్లు నమోదు చేస్తారని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం. ప్రసాద్‌బాబు తెలిపారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రశాంతి నిలయం/ పుట్టపర్తి టౌన్: కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ చేతన్ తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కార్యక్రమం కొనసాగుతుందని, ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందజేయవచ్చని పేర్కొన్నారు.

పోలీసు కార్యాలయంలో..

జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు ఎస్పీ రత్న తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై నేరుగా కలిసి ఫిర్యాదులు అందజేయవచ్చని సూచించారు.

అత్యాచారం దారుణం

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప



ఈరలక్కప్ప

మడకశిర: రాప్తాడు నియోజకవర్గం రామగిరి మండలంలో దళిత బాలికపై సామూహిక అత్యాచారానికి పాల్పడటం దారుణమని వైఎస్సార్‌సీపీ మడకశిర నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. అత్యాచారానికి పాల్పడిన వారందరూ టీడీపీకి చెందిన వారేనని పేర్కొన్నారు. మహిళలకు రక్షణ కల్పించడంలో హోం మంత్రి పూర్తిగా విఫలమయ్యారన్నారు. మహిళా ఎమ్మెల్యే, మహిళా ఎస్పీ ఉన్నా ఇటువంటి ఘటనలు చోటుచేసుకోవడం.. నిందితులపై ఎటువంటి చర్యలూ తీసుకోకపోవడం విచారకరమన్నారు. పోలీసులు రెడ్‌బుక్ రాజ్యాంగానికి వత్తాసు పలుకుతుండడంతోనే అత్యాచారాలను అరికట్టలేకపోతున్నారని ఆరోపించారు. వెంటనే నిందితులను అరెస్ట్ చేసి, కఠినంగా శిక్షించాలని కోరారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఏపీ ఈఏపీసెట్‌లో పలువురు ప్రతిభ



హర్షిత్‌రెడ్డి



కార్తికేయ



జశ్వితరెడ్డి

కదిరి అర్బన్/ నల్లచెరువు: ఏపీఈఏపీసెట్ ఫలితాల్లో పలువురు విద్యార్థులు ప్రతిభ చాటారు. కదిరి మండలం మొటుకుపల్లికి చెందిన రాధమ్మ, శేఖర్‌రెడ్డి దంపతుల కుమారుడు ఆర్.హర్షిత్‌రెడ్డికి 159వ ర్యాంకు వచ్చింది. కదిరికి చెందిన సుబ్రహ్మణ్యంనాయుడు కుమారుడు కార్తికేయకు 501 ర్యాంకు సాధించాడు. నల్లచెరువు మండల కేంద్రానికి చెందిన భాగ్యలక్ష్మి, కె.రాజారెడ్డి దంపతుల కుమార్తె జశ్వితరెడ్డి 444వ ర్యాంకు సాధించింది.

క్లుప్తంగా

మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు


హిందూపురంలో వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు

పుట్టపర్తి టౌన్: మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని వాహన దారులను పోలీసులు హెచ్చరించారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా జిల్లా వ్యాప్తంగా పోలీసులు ఆదివారం వాహన తనిఖీలు చేపట్టారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాలు అక్రమ రవాణా అరికట్టేలా చర్యలు తీసుకోవడంతో పాటు మద్యం సేవించి వాహనాలు నడపడం, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం, వాహనాలకు సరైన రికార్డులు లేకపోవడం, పెండింగ్ చలానాలు, తదితరాలను పరిశీలించారు. రికార్డులు సక్రమంగా ఉంచుకోవాలని, చలనాలు పెండింగ్ లేకుండా చెల్లించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. అలాగే పాత నేరస్తులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. శక్తి యాప్ వినియోగంపై మహిళలకు అవగాహన కల్పించారు.

రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి


మృతుడు వెంకటయ్య

గుత్తి: స్థానిక జీఆర్పీ పరిధిలోని జక్కల చెరువు - రాయల చెరువు రైల్వే స్టేషన్ల మధ్య ఆదివారం ఉదయం రైలు నుంచి జారిపడి ఓ ప్రయాణికుడు మృతి చెందాడు. సమాచారం అందుకున్న జీఆర్పీ ఎస్ఐ నాగప్ప, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడిని తెలంగాణలోని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మండలం చౌదరిపల్లికి చెందిన వెంకటయ్యగా గుర్తించారు. రైలులో తలుపు వద్ద నిలబడి ప్రయాణిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు జారి కింద పడినట్లుగా ప్రాథమిక విచారణలో నిర్ధారణ అయింది. మృతదేహాన్ని గుత్తిలోని ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

● అబ్బురపరుస్తున్న పెనుకొండ అందాలు


విజయనగర రాజుల రెండవ రాజధానిగా ఖ్యాతిగాంచిన పెనుకొండలోని పురాతన కట్టడాల సౌందర్యాలు పర్యాటకులను అబ్బురపరుస్తున్నాయి. చరిత్రకు సాక్షిగా నిలిచిన వందలాది కట్టడాలు ఇక్కడున్నాయి. వారాంతంలో ఇక్కడికి పెద్దఎత్తున పర్యాటకులు తరలివస్తుంటారు. –పెనుకొండ:


కొండపైన లక్ష్మీనరసింహస్వామి ఆలయ గోపురం


కొండపైకి వెళ్లేందుకు ఏర్పాటు చేసిన రహదారి


పెనుకొండలోని మహామంత్రి తిమ్మరుసు జైలు


అబ్బుర పరుస్తున్న గగన్‌మహల్


పెనుకొండ కోట సింహద్వారం

ఓటు ఎవరికంటూ సెల్ మోత

- నియోజకవర్గంలో మూడు రోజులుగా మోగుతున్న ఫోన్లు
- వచ్చే ఎన్నికల్లో ఎవరికి ఓటు వేస్తారని ఐవీఆర్ఎస్ సర్వే
- ఇప్పుడే ఎందుకంటూ ప్రజల అసహనం
- బటన్ నొక్కితే సంక్షేమ పథకాలు ఆగిపోతాయేమోననే భయం

గుడిబండ: ఇది ఎన్నికల సీజన్ కాదు. పోనీ ఉప ఎన్నికలు లేవు. మరి దేని కోసం ఆరా! ఎవరి కోసం ఈ సర్వే!! 'మీ ఓటు ఎవరికి? టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలైతే ఒకటి నొక్కండి.. వైఎస్సార్‌సీపీ అయితే రెండు నొక్కండి.. ఏ పార్టీ కాకపోతే మూడు నొక్కండి' అంటూ ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ (ఐవీఆర్ఎస్) కాల్స్‌తో మడకశిర నియోజకవర్గ వ్యాప్తంగా మూడు రోజులు సెల్‌ఫోన్లు మోత మోగుతున్నాయి. ప్రతి ఫోన్‌నూ పలకరిస్తున్నాయి.ఎన్నికల ఊసే లేని ప్రస్తుత తరుణంలో ఈ తరహా కాల్స్ అందుకున్న ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

కనుచూపు మేరలో కనిపించని ఎన్నికలు

సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడి ఏడాది మాత్రమే అయింది. మరో నాలుగేళ్ల తర్వాత జరిగే ఎన్నికల గురించి ప్రస్తుతం ప్రజలెవ్వరూ ఆలోచించడం లేదు. ఇలాంటి తరుణంలో అధికారంలోకి వచ్చేది ఎవరని సర్వే ద్వారా ప్రజాభిప్రాయం తెలుసుకోవాల్సిన అవసరం ఏ పార్టీకీ ఉండదు. అయితే ఇటీవల కడపలో నిర్వహించిన టీడీపీ మహానాడులో సాక్షాత్తూ సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. భవిష్యత్తులో అధికారం కోల్పోవచ్చుననే అనుమానాలు వ్యక్తం చేశారు. అంతేకాక కూటమి ప్రభుత్వ పాలనా వైఫల్యాలు, ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయకుండా కూటమి ప్రభుత్వ పెద్దలు చేసిన మోసాలను ఎండగడుతూ ఈ నెల 4న వైఎస్సార్‌సీపీ చేపట్టిన వెన్నుపోటు దినం విజయవంతమైంది. ప్రజల నుంచి అనూహ్య మద్దతు దక్కింది. ఈ రెండు చర్యలతో వైఎస్సార్‌సీపీ క్యాడర్లో నూతనోత్తేజం కనిపిస్తుండగా కూటమి నేతల వెన్నులో వణుకు మొదలైంది. కూటమి ప్రభుత్వంపై అన్ని వర్గాల్లో వ్యక్తమవుతున్న అసంతృప్తి ఏ స్థాయిలో పసిగట్టేందుకు 2019లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో గెలుపోటములను బేరీజు వేసుకునేలా చేపట్టిన సర్వేపై ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రజల నుంచే నేరుగా ఫీడ్ బ్యాక్ తీసుకునేందుకు ఈ తరహా చర్యలకు కూటమి ప్రభుత్వ పెద్దలు దిగినట్లుగా వాదనలు వినిపిస్తున్నాయి. అంతేకాక రాబోయే ఎన్నికల్లోనూ బీజేపీ, టీడీపీ, జనసేన కూటమిగానే బరిలో దిగుతున్నట్లుగా సంకేతాలు వెల్లడి కావడం గమనార్హం.

పథకాల లబ్ధి రద్దు చేస్తారనే భయం

ఐవీఆర్ఎస్ కాల్స్‌కు పార్టీలకు సంబంధం లేని అధిక శాతం మంది జనాలు సమాధానాలు చెప్పకుండా వదిలేస్తున్నారు. ఏం సమాధానం చెబితే ఎలాంటి విపత్కర పరిస్థితిని ఎదుర్కోవాల్సి వస్తోందననే భయం అందరినీ వెన్నాడుతోంది. ప్రధానంగా కూటమి పార్టీలకు వ్యతిరేకంగా బటన్ నొక్కితే, పథకాలు ఇతర ప్రయోజనాలు కోల్పోవాల్సి ఉంటుందనే అనుమానాలు అందరిలోనూ వ్యక్తమవుతోంది.

అత్యాచారం చేసిన వారిని ఎన్‌కౌంటర్ చేయాలి

- ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి డిమాండ్

అనంతపురం టవర్‌క్లాక్: రామగిరి మండలం ఏడుగుర్రాలపల్లిలో తొమ్మిదో తరగతి చదువుతున్న బాలికను బెదిరించి సామూహిక అత్యాచారంతో గర్భవతిని చేసిన కామాంధులను ఎన్‌కౌంటర్ చేయాలని, ఇందుకు అవసరమైతే చట్టంలో మార్పులు చేయాలని ప్రభుత్వాన్ని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి డిమాండ్ చేశారు. డిమాండ్ సాధనలో భాగంగా ఆదివారం అనంతపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. ఏడుగుర్రాలపల్లిలో దళిత బాలికను బెదిరించి ఆరు నెలల పాటు 17 మంది యువకులు అత్యాచారం చేశారని తెలిపారు. బాధితురాలికి న్యాయం చేకూరేలా కామాంధులను బహిరంగంగా ఎన్‌కౌంటర్ చేయాలని డిమాండ్ చేశారు. గతంలోనూ వీరు ఎంతోమంది మహిళలను ఇబ్బందులు పెట్టినట్లుగా ఆరోపణలున్నాయన్నారు. బాధిత కుటుంబానికి రక్షణ కల్పించి, వారికి న్యాయం చేయాలన్నారు. ఘటనపై వాస్తవాలు నిగ్గు తేల్చేందుకు సోమవారం ఏడుగుర్రాలపల్లిలో పర్యటించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి దళిత సంఘాలు తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు నరేష్ కొడవండ్ల, బీకేఎస్ ఆనంద్, ఓబులేసు, చంద్ర, వన్నూరుస్వామి, మదమంచి శ్రీనివాసులు, రామకృష్ణ, దావీదు, సూర్యనారాయణ, ఎర్రిస్వామి, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే బాలికపై అత్యాచారం చేసి గర్భవతిని చేసిన వారికి ఉరి శిక్ష వేయాలని ప్రభుత్వాన్ని ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు నెరమెట్ల యల్లన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం అనంతపురంలోని అంబేడ్కర్ విగ్రహ వద్ద దళిత సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చట్టాలు కఠినతరం చేయాలన్నారు. బాధిత కుటుంబానికి కోటి రూపాయల పరిహారాన్ని చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌ఈఎఫ్ నాయకులు రామచంద్ర, కేపీ నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

అప్పులు తీర్చే మార్గం కానరాక వ్యక్తి ఆత్మహత్య


శ్రీరాములు (ఫైల్)

బత్తలపల్లి: అప్పులు తీర్చే మార్గం కానరాక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... బత్తలపల్లి మండలం ఈదుల ముషారు గ్రామానికి చెందిన సిరప్పగారి శ్రీరాములు(41)కు భార్య రామాంజినమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. కూలి పనులతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ క్రమంలో కుటుంబ పోషణ, ఇతర అవసరాలకు గ్రామంలో తెలిసిన వారి వద్ద పదేళ్ల క్రితం అప్పులు చేశాడు. ఈ అప్పులకు వడ్డీల భారం పెరిగి రూ.12 లక్షలకు చేరుకుంది. అప్పు తీర్చాలంటూ ఒత్తిళ్లు తీవ్రం కావడంతో దిక్కుతోచని స్థితిలో న్యాయస్థానాన్ని ఆశ్రయించి ఐపీ నోటీసులు పంపాడు. అనంతరం అప్పులు ఇచ్చిన వారికి ముఖం చూపించలేక పదేళ్ల క్రితం గ్రామం విడిచి చెన్నైకు వలస వెళ్లి అక్కడే కూలి పనులతో జీవనం సాగించసాగాడు. ఐదు నెలల క్రితం చెన్నై నుంచి తిరిగి వచ్చి బత్తలపల్లిలోని తాడిపత్రి రోడ్డులో ఉన్న బీసీ కాలనీలో నివాసముంటున్నాడు. తన పరిస్థితిని తలుచుకుని మదనపడుతూ మద్యానికి బానిసయ్యాడు. శనివారం తన భార్య రామాంజినమ్మతో 'నేను అప్పులు తీర్చలేను, అప్పలోళ్లకి నా మొహం కూడా చూపించలేకున్నా' అంటూ కన్నీటి పర్యంతమయ్యాడు. రాత్రి భోజనం ముగించుకున్న రామాంజినమ్మ తన ఇద్దరు కుమారులతో కలసి మిద్దెపైకి వెళ్లి నిద్రించింది. ఇంట్లో నిద్రించిన శ్రీరాములు అర్ధరాత్రి సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం ఉదయం కిందకు దిగి వచ్చిన కుటుంబసభ్యులు.. అప్పటికే ఉరికి విగతజీవిగా వేలాడుతున్న శ్రీరాములును చూసి బోరున విలపించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, రామాంజినమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

రాష్ట్ర స్థాయి మహిళల హాకీ పోటీల్లో జిల్లాకు కాంస్య పతకం


కాంస్య పతకం సాధించిన జిల్లా జట్టు

ధర్మవరం రూరల్: హాకీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో భీమవరం వేదికగా మూడు రోజులుగా జరుగుతున్న 15వ రాష్ట్ర స్థాయి జూనియర్ మహిళల హాకీ పోటీల్లో జిల్లా జట్టుకు కాంస్య పతకం దక్కింది. ఈ మేరకు హాకీ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యక్షుడు సూర్యప్రకాష్ , మేనేజర్ అరవింద్ గౌడ్, కోచ్ మారుతీకుమార్ ఆదివారం తెలిపారు. మొదటి లీగ్ మ్యాచ్‌లో నంద్యాల జిల్లా జట్టుపై 16–0, రెండో రోజు నెల్లూరు జిల్లా జట్టుపై 11–0, తిరుపతి జిల్లా జట్టుపై 3–1 స్కోరుతో విజయం సాధించి సెమీఫైనల్‌కు జిల్లా జట్టు చేరుకుంది. అనంతపురం జిల్లా జట్టుతో జరిగిన సెమీఫైనల్ మ్యాచ్‌లో పెనాల్టీ షూట్ అవుట్‌లో 3–2 గోల్స్ తేడాతో ఓటమి పాలైంది. మూడో స్థానం కోసం ప్రకాశం జిల్లా జట్టుతో తలపడి 2–0 గోల్స్ తేడాతో విజయం సాధించింది. జిల్లాకు చెందిన హేమ బెస్ట్ డిఫెండర్ ఆఫ్ ది టోర్నీగా అవార్డు దక్కించుకుంది. ప్రతిభ చాటిన జిల్లా క్రీడాకారులను జిల్లా స్పోర్ట్స్ అథారిటీ హాకీ కోచ్ హుస్సేన్, సీనియర్ క్రీడాకారులు బీవీ శ్రీనివాసులు, బండి వేణుగోపాల్, షబ్లెం వేణుగోపాల్, అంజన్న, గౌరీ ప్రసాద్, తదితరులు అభినందించారు.

● ఇదేనా సంపద సృష్టి!



గుంతకల్లు నుంచి పత్తికొండకు పల్లె వెలుగు బస్సులో వసూలు చేసిన టిక్కెట్ ధర రూ.40



పత్తికొండ నుంచి గుంతకల్లుకు పల్లె వెలుగు బస్సులో వసూలు చేసిన టిక్కెట్ ధర రూ.50

గుంతకల్లు: తాము అధికారంలోకి వస్తే సంపద సృష్టి చేసి ప్రజలకు పంపిణీ చేస్తామని హామీనిచ్చిన కూటమి పెద్దలు... అధికారం చేపట్టిన తర్వాత కంటికి కనిపించని దోపిడీకి తెరలేపారు. ఒకే దూరం.. ఒకే రకమైన ఆర్టీసీ బస్సులో ప్రయాణానికి రూ.10 వ్యత్యాసంతో చార్జీలు వసూలు చేయడమే ఇందుకు నిదర్శనం. గుంతకల్లుకు చెందిన ఓ ప్రయాణికుడు ఆదివారం ఉదయం పల్లె వెలుగు బస్సులో బురుజల మీదుగా పత్తికొండకు వెళ్లాడు. 35 కి.మీ. దూరం ప్రయాణానికి రూ.40 టికెట్ ధర చెల్లించాడు. అనంతరం సాయంత్రం పల్లె వెలుగు బస్సులోనే బురుజల మీదుగా గుంతకల్లుకు చేరుకున్నాడు. ఇందుకు టికెట్ ధర రూ.50 చెల్లించాడు. ఉదయం రూ.40 తీసుకున్నారు... సాయంత్రం రూ.50 తీసుకుంటున్నారు ఎందుకంటూ కండక్టర్‌ను నిలదీయడంతో ఉదయం 35 కి.మీ. దూరం ఉందని, సాయంత్రం 40 కి.మీ. దూరం ప్రయాణించాల్సి వస్తోందని కండక్టర్ తెలపడంతో ప్రయాణికులు అవాక్కయారు. ఈ వ్యత్యాసం వెనుక ఉన్న దోపిడీ ప్రభుత్వ పెద్దలకే తెలియాలని విమర్శలు గుప్పించారు.

కష్టాల 'యోగ'ం


బొమ్మనహాళ్‌లో యోగా చేస్తున్న అధికారులు

- యోగా డే యాప్ సర్వే పేరుతో కార్యదర్శులకు సర్కార్ టార్గెట్లు
- ఓటీపీలతో తప్పని ఇక్కట్లు

బొమ్మనహాళ్: ప్రచార ఆర్భాటానికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్న కూటమి సర్కార్ తీరుతో అధికారులకు ఇక్కట్లు తప్పడం లేదు. ప్రతి పనికీ సర్వేల పేరుతో ఇటు సచివాలయ సిబ్బందిని, అటు ప్రజలనూ ఇబ్బంది పెడుతున్నారనే విమర్శలు ఇటీవల ఎక్కువయ్యాయి. ఈ క్రమంలో పని ఒత్తిడికి లోనైన సచివాలయాల కార్యదర్శుల పరిస్థితి మరీ దారుణంగా మారింది. తాజాగా యోగ యాప్ అంటూ ఇంటింటికీ వెళ్లి సర్వే చేయాలంటూ జారీ అయిన ప్రభుత్వ ఆదేశాలతో సచివాలయ ఉద్యోగులకు కష్టాల 'యోగ'ం రెట్టింపయింది.

ఫేస్ రికగ్నైజేషన్‌తో తిప్పలు

సచివాలయ కార్యదర్శులు తమ పరిధిలోని ప్రతి ఇంటికీ వెళ్లి యోగా యాప్ చూపించి వారు వస్తారో లేదో తెలుసుకుని వివరాలు నమోదు చేయాలి. హాజరయ్యేందుకు ఆసక్తి చూపితే వివరాల నమోదు సమయంలో వారి ఫోన్ నంబర్‌కు ఓటీపీ వస్తుంది. దానిని నమోదు చేసి సబ్మిట్ చేయాల్సి దరఖాస్తు పూర్తి చేసినట్లే. ఇంత వరకూ అంతా బాగున్నా... నో ఆప్షన్ పెడితే... ఆ కుటుంబంలో ఎవరో ఒకరిది ఫేష్ రికగ్నైజేషన్ లేదా బయోమెట్రిక్‌తో వివరాలు పూర్తి చేయాల్సి ఉంది. నో ఆప్షన్ కింద వివరాలు నమోదు చేయడం కార్యదర్శులకు చుక్కలు చూపిస్తోంది. 'కార్యక్రమంలో పాల్గొనడం తమకు ఆసక్తి లేదంటే ఫొటో తీస్తారా? బయోమెట్రిక్ కావాలని అడుగుతారా? అసలు ఎందుకివ్వాలి? ముందు ఇక్కడి నుంచి వెళ్లిపోండి?' అంటూ గృహ యజమానులు అసహనం వ్యక్తం చేస్తుండడంతో వారికి నచ్చచెప్పుకోలేక కార్యదర్శులు తలలు పట్టుకుంటున్నారు. అసలే సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని పేపర్లు, సోషల్ మీడియాల్లో వార్తలు వస్తున్నాయని, ప్రభుత్వం, పోలీసులు, అధికారులు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్న తరుణంలో ఓటీపీలు అడగడమేంటని ప్రశ్నిస్తున్నారు.

ఓ వైపు శిక్షణ... మరోవైపు పోటీలు

మూడు రోజుల క్రితం యోగాంధ్ర యాప్‌లో పంచాయతీల్లో యోగాసనాలపై మహిళలు, పురుషులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ఇచ్చినట్లు వివరాలు నమోదు చేయాలని నిబంధన పెట్టారు. ఒక వైపు మండల స్థాయిలో మాస్టర్స్ ట్రైనర్స్‌తో శిక్షణా కార్యక్రమాలునిర్వహిస్తున్నారు. శిక్షణ పూర్తయిన తర్వాత సచివాలయ స్థాయిలో యోగా తరగతులు నిర్వహించాలని అధికారులు ఇప్పటికే సూచించారు. ఇది పూర్తి కాకుండానే పంచాయతీల పరిధిలో పోటీలు ఎలా పెట్టాలో, శిక్షణ లేని వారు పోటీల్లో ఎలా పాల్గొంటారో అర్థం కావడం లేదని సచివాలయ కార్యదర్శులు వాపోతున్నారు.

ప్రజా సేవలకు దూరంగా...

ఒక్కో సచివాలయ పరిధిలో వేలాది మందిని సర్వే చేసి యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొంటున్నదీ.. లేనిది వివరాలు నమోదు చేయాలంటే ఎన్ని రోజులు పడుతుందో ఉన్నతాధికారులకే ఓ అంచనా లేదు. అన్నీ బాగుండి సర్వర్ మొరాయించకపోతే పూర్తి చేయడానికి ఒక్కో వ్యక్తి దగ్గర కనీసం 10 నిమిషాల సమయం పడుతోంది. దీంతో కార్యదర్శులు ప్రజా సేవలకు దూరంగా ఉండాల్సి వస్తోంది. ప్రస్తుతం సచివాలయాల వద్దకు రేషన్‌కార్డులు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు వెళ్లే వారి సంఖ్య ఎక్కువగా ఉంటోంది. ఇలాంటి తరుణంలో సర్వేల పేరుతో కార్యదర్శులు అందుబాటులో లేకపోవడంతో అర్జీదారులు ఇబ్బందులు పడుతున్నారు.

బాబురెడ్డి కుటుంబసభ్యులకు వైఎస్ జగన్ పరామర్శ

సోమందేపల్లి: నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ మాజీ సమన్వయకర్త చల్లాపల్లి బాబురెడ్డి శుక్రవారం మృతి చెందిన విషయం తెలిసిందే. ఆదివారం సాయంత్రం బాబు రెడ్డి సతీమణి ఉమాను వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫోన్ ద్వారా పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని, అన్ని విధాలుగా పార్టీ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు.

వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ సత్యనారాయణ

అనంతపురం మెడికల్: ప్రభుత్వ వైద్య కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా డాక్టర్ కేవీవీ సత్యనారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు జీఎంసీలోని న్యూరో సర్జరీ విభాగాధిపతిగా ఉన్న ఆయనను తాత్కాలిక అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్‌గా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం. అలాగే అడ్మినిస్ట్రేషన్ గ్రౌండ్స్ కింద ఇక్కడ పని చేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావును ఒంగోలు ప్రభుత్వ సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్‌గా నియమించారు. ప్రభుత్వ సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్‌గా ఉన్న డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావును కడప జీజీహెచ్‌కు బదిలీ చేశారు. ఇదిలా ఉండగా ప్రభుత్వ సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్‌గా ఇంకా ఎవరినీ నియమించలేదు.

ప్రతి విద్యార్థికీ మిత్ర కిట్లు అందించాలి


బత్తలపల్లి ఎమ్మార్సీలో విద్యార్థి మిత్ర కిట్ల గురించి ఆరా తీస్తున్న విద్యాశాఖ జేడీ సుబ్బారావు

బత్తలపల్లి: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లను ప్రతి విద్యార్థికీ అందేలా చొరవ తీసుకోవాలని ఉమ్మడి జిల్లా నోడల్ ఆఫీసర్, విద్యాశాఖ జేడీ సుబ్బారావు పేర్కొన్నారు.బత్తలపల్లిలోని ఎమ్మార్సీలో పంపిణీకి సిద్ధంగా ఉన్న మిత్ర కిట్లను ఆదివారం ఆయన పరిశీలించారు. అందిన పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, బూట్లు, సాక్సులు, డిక్షనరీలు, బ్యాగులు, బెల్ట్‌ల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వరాదన్నారు. నిర్ణీత సమయంలోపు కిట్ల పంపిణీ ప్రక్రియ పూర్తి కావాలని ఎంఈఓలను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈఓ సుధాకర్‌నాయక్, ఎమ్మార్సీలు గోవిందరెడ్డి, వెంకటరమణ, సునీత, మంజుల, ఉపాధ్యాయ సంఘాల నాయకులు బుక్కచెర్ల రామకృష్ణారెడ్డి, నరసింహమూర్తి, షరీఫ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రైళ్లలో తనిఖీలు


రైలులో ప్రయాణికుల బ్యాగ్‌లు పరిశీలిస్తున్న పోలీసులు

కదిరి టౌన్: స్థానిక రైల్వే స్టేషన్‌లో ఆదివారం ఉదయం జీఆర్పీ, ఆర్‌పీఎఫ్ సిబ్బంది ముమ్మర తనిఖీలు చేపట్టారు. ప్రయాణికుల లగేజీ బ్యాగులను పరిశీలించారు. కదిరి రైల్వే ఎస్ఐ రహీమ్, సిబ్బంది పాల్గొన్నారు.

తన్నుకున్న 'తమ్ముళ్లు'

గార్లదిన్నె: మండలంలోని కనుంపల్లికి చెందిన టీడీపీ కార్యకర్తలు రెండు వర్గాలుగా విడిపోయి పరస్పర దాడులతో రెచ్చిపోయారు. టీడీపీ కార్యకర్తలు ప్రసాద్, కుమార్, వెంకటలక్ష్మికి అదే పార్టీకి చెందిన రాము, సంతోష్, ఇందు, నల్లమ్మతో విభేదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పాత కక్షలను దృష్టిలో ఉంచుకుని ఆదివారం ఇరు వర్గాలు రాళ్లు, కట్టెలతో దాడులు చేసుకున్నారు. ఘటనలో గాయపడిన ఇరు వర్గాల వారినీ స్థానికులు 108 ద్వారా సర్వజనాస్పత్రికి తరలించారు. ఘటనపై ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గంజాయి తరలింపుదారుల అరెస్ట్

అనంతపురం సిటీ: రైలులో గంజాయి తరలిస్తూ అనంతపురం రైల్వే స్టేషన్‌లో ఇద్దరు యువకులు రైల్వే పోలీసులకు పట్టుబడ్డారు. జీఆర్పీ ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఆర్‌పీఎఫ్ ఎస్ఐ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపిన మేరకు... అందిన సమాచారం మేరకు ఆదివారం ఉదయం అనంతపురం రైల్వే స్టేషన్‌లో జీఆర్పీ, ఆర్‌పీఎఫ్ ఆధ్వర్యంలో ముమ్మర తనిఖీలు చేపట్టారు. భువనేశ్వర్ నుంచి వచ్చిన రైలులో అనంతపురంలో దిగిన ప్రయాణికుల బ్యాగ్‌లు పరిశీలించారు. సమయంలో రెండు బ్యాగ్‌లో 24 కిలోల గంజాయిని గుర్తించి, సంబంధికులను అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం వారిని అరెస్ట్ చేశారు. పట్టుబడిన వారిలో రాప్తాడు మండలం సీపీఐ కాలనీ, కంబదూరు కొట్టాలకు చెందిన బిస్కట్ ఫయాజ్, బిస్కట్ మహబూబ్‌పీరా ఉన్నారు. వీరు భువనేశ్వర్ నుంచి గంజాయి తెచ్చి ఎక్కువ ధరకు అమ్మేవారని విచారణలో నిర్ధారణ అయినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.1.20 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరు పరుస్తున్నట్లు ఎస్ఐలు పవన్‌కుమార్‌రెడ్డి, వెంకటేశ్వర్లు తెలిపారు.